

సచివాలయ ఉద్యోగులు పారదర్శకంగా సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్

పెదవేగి: సచివాలయ ఉద్యోగులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటక పద్మశ్రీప్రసాద్ సూచించారు. మండలంలోని దుగ్గిరాల గ్రామ సచివాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వాటిలో కొన్నిలోపాలు గుర్తించి, వాటిని సరిచేసుకుని మరింత సమర్థవంతంగా సేవలందించాలన్నారు. సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అందజేయాలని సూచించారు.

- ధాన్యం కొనుగోలు సమస్యలను ముందే పరిష్కరించాలంటున్న రైతులు
- తేమ, తూకం పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ఆవేదన
- మిల్లుల్లో అన్‌లోడింగ్ ఆలస్యంతో రైతులపై అదనపు ఛార్జీల భారం
- లారీలు, సంచుల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి
- గత రబీలో ఎదురైన సమస్యలపై దృష్టి సారించాలంటున్న అన్నదాత

ప్రతియేటా ధాన్యం కొనుగోలుపై పాలకులు, అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏ మాత్రం సంబంధం ఉండటం లేదు. ధాన్యం కొనుగోలుపై ముందస్తు సమావేశాల పేరుతో హడావుడి చేయడం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల సమస్యలే ప్రధానమని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వీటికితోడు లారీలు లేక రవాణా ఇబ్బందులు, సంచుల కొరత వరి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గడిచిన రబీలో ధాన్యం కొనుగోలులో రైతులు పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలుపై ముందుగానే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మిల్లర్లే సమస్య..!



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు అక్టోబర్ నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తు సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు. అయితే రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మాత్రం స్పష్టత ఇవ్వని పరిస్థితి ఉంది. అంతకుముందుగాని, గడిచిన రబీలోగాని ధాన్యం కొనుగోలులో రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతమని చెప్పొచ్చు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లర్లే ప్రధాన సమస్యగా మారారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రస్తుత ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోలుకు సంబంధించి మాత్రం ఇప్పటి నుంచే తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రైతుభరోసా కేంద్రాల్లో తేమశాతం, వే్‌బ్రిడ్జి తూకం పరిశీలన జరిగిన తర్వాత అధికారుల ఆధ్వర్యంలోనే రైతులు మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. తీరా ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత అక్కడ మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తేమశాతం ఎక్కువగా ఉందంటూ ధాన్యం దిగుమతి చేయకుండా నిలుపుదల చేస్తున్నారు. తేమశాతాన్ని బట్టి రైతుల నుంచి సొమ్ము వసూలు చేస్తున్నారు. వే్‌బ్రిడ్జి కాటా వేసిన తర్వాత కూడా తూకంలో తేడా ఉందంటూ మళ్లీ సొమ్ము వసూళ్లు జరుగుతున్నాయి. రైతుల నుంచి వసూలు చేస్తున్న సొమ్మును ఫోన్‌పే ద్వారా తీసుకుంటున్నారు. సొమ్ము చెల్లించకపోతే ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదు. ఇదంతా బహిరంగంగానే జరుగుతోంది. అయినప్పటికీ రైతులకు న్యాయం జరగని పరిస్థితి ఉంది. రబీ సీజన్‌లో చాలామంది రైతులు రూ.15 వేల నుంచి రూ.22 వేల వరకూ మిల్లర్లకు చెల్లించిన పరిస్థితి ఉంది. రైతుభరోసా కేంద్రంలో తేమ, తూకం పరిశీలించి అంతా బాగుందని పంపిన తర్వాత మిల్లర్లు సొమ్ము వసూలు చేయడంపై ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకోవడం లేదు. రైతుల నుంచి సొమ్ము వసూలు చేస్తే మిల్లులు సీజ్ చేస్తామని ప్రకటనలు గుప్పించడంతోనే సరిపోతుంది. సొమ్ము వసూలు చేసిన మిల్లర్ల నుంచి తిరిగి రైతులకు సొమ్ములు ఇప్పించడం వంటి చర్యలు ఎక్కడా జరగలేదు. తేమ, తూకం విషయంలో ఎందుకు తేడాలు చూపిస్తున్నారో స్పష్టమైన ఆధారాలు సైతం చెప్పడం లేదు. తేమ, తూకం విషయంలో రైతుభరోసా కేంద్రాల అధికారుల నిర్ణయమే అంతిమంగా ప్రభుత్వం ప్రకటించాలి. ఒక్కసారి రైతుభరోసా కేంద్ర అధికారులు అన్నీ సవ్యంగా ఉన్నాయని పంపించిన తర్వాత కూడా మిల్లర్లు సొమ్ము వసూలు చేస్తే ఎటువంటి చర్యలు తీసుకుంటారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. మిల్లర్లకు తేమ, తూకం నిమిత్తం ఎటువంటి సొమ్మూ చెల్లించనక్కర్లేదని అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకుండా ఆలస్యం చేయడంతో అధికంగా రవాణా ఛార్జీల భారం రైతులపై పడుతోంది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

లారీలు, సంచుల సమస్య తీరేనా

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెడుతున్న మరో సమస్య రవాణాకు సంబంధించి లారీలు, సంచుల సమస్యలు. ఏలూరు జిల్లాలో ప్రధానంగా ఈ సమస్య అత్యధికంగా ఉంటుంది. మాసూళ్లయిన తర్వాత లారీలు ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో రైతులే పెద్దమొత్తంలో కిరాయిలు చెల్లించి లారీలు పెట్టుకోవాల్సిన దుస్థితి ఉంటుంది. లారీలు లేక మాసూలు చేశాక 15 రోజులకుపైగా ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోతున్న పరిస్థితీ ఉంది. సంచులు సరిపడా ఇవ్వకపోవడం, చిరిగిన సంచులు ఇవ్వడం వంటి సమస్యలతో రైతులు నలిగిపోతున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. లేకపోతే అధికారులు ఎన్ని సమావేశాలు పెట్టినా రైతులకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదని చెప్పొచ్చు.

అప్పుల ఊబిలో అన్నదాతలు


- ప్రతి రైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలి
- కౌలు రైతులకు 'రైతు భరోసా' అందించాలి
- ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ
- 25 నుంచి తహశీల్దార్ కార్యాలయాలు ముందు ధర్నాలకు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉంగుటూరు

పంట నష్టాలతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదనవ్యక్తం చేశారు. ప్రతిరైతుకూ రూ.రెండు లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై ఈనెల 25, 26, 27 తేదీల్లో అన్ని మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చిందన్నారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వర్షాభావ పరిస్థితి వల్ల పంటల సాగు ఆలస్యమై సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మెట్ట ప్రాంత మండలాల్లో చెరువులు అడుగంటాయని, భూగర్భ జలాలు భారీగా తగ్గిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మరోవైపు అనేక సంవత్సరాలుగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని చెప్పారు. కష్టపడి పంటలు పండించినా మార్కెట్‌లో కనీస ధర రావడం లేదన్నారు. ధాన్యం కొనుగోలులో నిబంధనల పేరుతో జరుగుతున్న మోసాల వల్ల మద్దతు ధర దక్కడం లేదన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు చెల్లించడానికి అధిక వడ్డీలకు ప్రయివేటు అప్పులపై ఆధార పడాల్సి వస్తోందన్నారు. గత తొమ్మిదేళ్లలో మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని చెప్పారు. కష్టపడి పంటలు పండిస్తూ దేశానికి ఆహార ధాన్యాలు అందిస్తున్న అన్నదాతలకు మాత్రం ఒక్కపైసా కూడా రుణమాఫీ చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో ప్రతిరైతుకూ రూ.2 లక్షలు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకంలో అనేక నిబంధనలు పెట్టి కౌలు రైతులకు మొండి చేయిచూపారని విమర్శించారు. ఓసి సామాజిక తరగతి కౌలు రైతులకు రైతు భరోసా లేదని, ఒక భూ యజమాని కింద ఎంతమంది కౌలు రైతులున్నా ఒక్కరికి మాత్రమే సాయం అందించడంతో అర్హులైన కౌలు రైతులకు అన్యాయం జరిగిందని చెప్పారు. నిబంధనలను సవరించి కౌలు రైతులందరికీ రైతు భరోసా అందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర్‌రావు, కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వివిధ మండలాల నుంచి వచ్చిన రైతు సంఘం నాయకులు గుండపనేని సురేష్, సున్నా వెంకట్రావు, గండి రాజా, కోనా శ్రీనివాసరావు, బోయపాటి సత్యనారాయణ, ఎన్.శశికళ, వెలగలేటి మోహన్‌రావు, టి.మురళీ, కౌలురైతు సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరాచంద్రమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు ఇందుకూరి వెంకటరామరాజు పాల్గొన్నారు.



జిఒ కాపీలు దహనం చేస్తున్న నాయకులు

జిఒ 660 ప్రతులు దహనం

పంటల బీమాను ప్రభుత్వమే అందించాలి

రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఉంగుటూరు

2023-24 పంటల బీమాను ప్రయివేటు బీమా కంపెనీలకు అప్పగించొద్దని, రాష్ట్ర ప్రభుత్వమే తన బాధ్యతగా పంటల బీమా పథకాన్ని నిర్వహించాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కైకరం పంచాయతీ కార్యాలయం సమీపంలో జిఒ 660 కాపీలు దహనం చేసి నిరసన తెలిపారు. పంటల బీమాపై జారీ చేసిన జిఒ 660ను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసిం, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు మాట్లాడుతూ పంటల బీమాలో ప్రయివేటు బీమా కంపెనీల ప్రవేశం నిలిపివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా అమలు చేయాలని కోరారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బీమా కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందన్నారు. పంటల బీమా విధానం రైతులకు నష్టం చేసేదిగానూ, బీమా కంపెనీలకు ఉపయోగపడేదిగానూ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి లొంగి పంటల బీమా పథకంలో ప్రయివేటు బీమా కంపెనీలను అనుమతించొద్దన్నారు. ప్రధాన మంత్రి ఫసలీ బీమా కంపెనీల లాభాల కోసమే తప్ప రైతుల ప్రయోజనం కోసం కాదని విమర్శించారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకొచ్చి అన్ని పంటలకూ బీమా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ విజయరాజు

లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) వైఎస్‌ఆర్‌కెపి ప్రాజెక్ట్‌లో జరుగుతున్న అన్ని అంశాలపై సమీక్షించి ఎక్కడైతే వెనుకబడి ఉన్న మండలాలున్నాయో వాటి పనితీరును మెరుగుపరచుకుని లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. పెదపాడు మండలం వట్లూరులోని టిటిడిసిలో గురువారం డిఆర్‌డిఎ, వైఎస్‌ఆర్‌కెపి సిబ్బంది పిఎంలు, డిపిఎంలు, ఎపిఎంలు, సిసిలు తదితరులతో విజయరాజు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్లకు సంబంధించి బిబిఎల్ నుంచి బిఎల్ వరకూ ఈ నెలలో ఐదు వేల మంది లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకుని త్వరితగతిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సెర్ఫ్ ఉద్యోగులు తమకు ప్రభుత్వం ప్రకటించిన 23 శాతం జీతాలు పెంపుదలపై సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'


ముసునూరు: ఈనెల 22వ తేదీన జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం పది గంటల నుండి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్ల పరిశీలనలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన, వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బి.ఎ.సత్యనారాయణ, మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

గురజాడ అప్పారావు జయంత్యుత్సవం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవత, మాతృదేవోభవ సేవా ట్రస్ట్, డిఆర్‌డిఎ, సెట్‌వెల్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీలు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేశమంటే మట్టి కాదు.. దేశమంటే మనుషులోయ్, దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్న గీతాలతో ఏలూరు నగరంలోని వేద పాఠశాల, కళాశాల విద్యార్థులు అందరినీ ఉత్తేజపరిచారు. ఉదయం తొమ్మిది గంటలకే ఏలూరులోని వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పెద్దఎత్తున ఇండోర్ స్టేడియానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య 'దేశమును ప్రేమించుమన్న' ప్లకార్డును ఊపి ప్రదర్శనను ప్రారంభించారు. గురజాడ భారీ చిత్రపటంతో గురజాడ అప్పారావు వేషధారణతో పలువురు విద్యార్థులు ముందుకుసాగారు. వారివెంట భారీసంఖ్యలో విద్యార్థులు ప్రదర్శనగా బయలుదేరారు. ఈ ప్రదర్శన స్టేడియం నుండి మెయిన్ రోడ్డు, ఫైర్ స్టేషన్ సెంటర్, డిఇఒ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫీస్, జిల్లా గ్రంథాలయం మీదుగా తిరిగి ఇండోర్ స్టేడియానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. అక్కడ దేశభక్తి గేయాలను సామూహికంగా ఆలపించారు. వారంరోజులుగా ఉత్సవ కమిటీ 50 హైస్కూళ్లు, 17 కళాశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రతీ విద్యాలయంలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించాలని, దేశమును ప్రేమించుమన్న గేయంలో ఆరు చరణాలు పాడించే కార్యక్రమం విద్యాలయాల్లో పెద్దఎత్తున నిర్వహించారు. అనంతరం 25 పాఠశాలలు, ఐదు కళాశాలల విద్యార్థులు స్వచ్ఛంద సంస్థలు అందించిన బ్యాన్లు, యూనిఫారాలతో ఇండోర్ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి చేరుకున్నారు. తొలుత ముద్దుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, ఏలూరు ఎంఇఒ రంగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్.కస్తూరిరావు అతిథులకు స్వాగతం పలికారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎం.సుజయ్ అధ్యక్షతన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణయ్య, రంగయ్య మాట్లాడుతూ అప్పారావు జీవితాన్ని, ఆయన రచించిన దేశమును ప్రేమించుమన్న గేయాన్ని ఎల్లవేళలా గుర్తుంచుకోవాలన్నారు. ఎల్‌బిసి స్కూల్ విద్యార్థులు పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, ఎఆర్‌డిజికె హై స్కూల్ విద్యార్థులు నిర్వహించిన దేశమును ప్రేమించుమన్న గేయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం గురజాడ వేషధారులకు పతకాలు, ప్రశంసాపత్రాలను అతిథులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు, మానవత జిల్లా సమన్వయకర్త ఆలపాటి నాగేశ్వరరావు, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ప్రయివేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు కెసిహెచ్.చంద్రశేఖర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎం.సుజయ్‌కృష్ణ, కార్యదర్శులు అజయ్‌బాబు, కూచిపూడి సత్యనారాయణ, వై.ఆనంద నాయుడు, పీడీ.రత్నాకర్‌రావు, టి.బుజ్జి, రమేష్, సోమ్లా నాయక్, జి.శారద, కె.శ్రావణి, ఎం.లక్ష్మి, పి.దుర్గాప్రసాద్, వి.సురేష్, వి.టాగోర్, కె.శ్రీనివాసరావు, పివి.నరసింహారావు, బి.మోహన్‌రావు, పి.శ్రీనివాసరావు, సిహెచ్.జగదీష్, ఎం.సాయి, సిద్ధార్థ, త్రినాథ్, కార్యదర్శి మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

ఏలూరు : దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులే అని చాటిచెప్పిన సంఘసంస్కర్త, అభ్యుదయ కవి, గురజాడ అప్పారావు అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఎ.రవి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో నడుస్తుందని, నిత్యం దేశభక్తి గురించి మాట్లాడే మోడీ, నిజమైన దేశభక్తి అంటే దేశంలో ఉన్న మనుషులను పట్టించుకోవడం, వారి సమస్యలు పరిష్కరించడమేనన్నారు. అందుకే ఆ కాలంలోనే గురజాడ దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని తెలియజెప్పారని గుర్తు చేశారు. ఆనాటికి ఉన్న మహిళల వివక్షపై ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. వితంతు వివాహాలను జరిపించారన్నారు. గురజాడ సమాజ అభివృద్ధికి చేసిన రచనలను, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వెలుగులోనికి తీసుకొచ్చారని తెలిపారు. ఒకపక్కన దళితులు, మహిళలు, మైనార్టీల పట్ల వివక్ష చూపుతున్న మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నూతన పార్లమెంటు ప్రారంభోత్సవం సందర్భంగా పార్లమెంట్ సభ్యులకు ఇచ్చిన రాజ్యాంగప్రతిలో సోషలిస్ట్ లౌకిక పదాలను తొలగించడం రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శించారు. మహిళా బిల్లు తెచ్చామంటూ గొప్పలు చెబుతున్న బిజెపి మహిళలను రెండో తరగతి పౌరులుగా చూడటాన్ని తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, ఆ పార్టీ నాయకులు ఎం.ఇస్సాక్, జి.రవీంద్ర, వేణుగోపాల్, త్రినాథ్ పాల్గొన్నారు



ఏలూరులో మాట్లాడుతున్న గుడిపాటి నరసింహారావు

గురజాడ జీవితం ఆదర్శం : అరసం

టి.నరసాపురం: గురజాడ అప్పారావు జీవితం నేటి విద్యార్థులకు ఆదర్శమని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్ అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెంలో హేమసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో అరసం, హేమసాయి హైస్కూల్ యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పూర్ణమ్మ కథ నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజన్ యుపి స్కూలు విద్యార్థులు గురజాడ జీవిత విశేషాలను తమ ప్రసంగాల రూపంలో సభ ముందుంచారు. అనంతరం విజన్ ఇంగ్లీషు మీడియం యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాగర్ మాట్లాడుతూ గురజాడ సంఘ సంస్కర్తగా, సాహితీ సృజనకారుడుగా ఆయన సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపిపి బి.దివ్య భారతి, అర్జా ధర్మారావు, అడపా కిన్నెర, టి.జ్యోతి, కె.దిలీప్ కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

---

52 జాబ్‌మేళాలు.. 2196 మందికి ఉపాధి

జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణరావు

ప్రజాశకి - ఏలూరు

జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా ప్రతీరోజు రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సి.మధుభూషణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి సుమారు మూడు వేల మంది నమోదు చేసుకుంటున్నారని, 1200 మంది రెన్యూవల్ చేయించుకుంటున్నారన్నారు. ఎన్‌సిఎస్ పోర్టల్లో ఈ ఏడాది జనవరి నుండి ఆగష్టు వరకూ 11,906 మందిని నమోదు చేశామన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో ప్రతీనెల జాబ్‌మేళాలు నిర్వహించి ప్రయివేటు కంపెనీల్లో ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 52 జాబ్ మేళాలు నిర్వహించి 2196 మందికి ఉపాధి కల్పించామన్నారు. ఎంప్లాయిమెంట్, ఎపిఎస్ఎస్‌డిసి, సిడాప్ ద్వారా ప్రతినెలా ఆయా నియోజకవర్గాల వారీగా స్థానిక శాసన సభ్యుల ద్వారా మెగాజాబ్ మేళాలు నిర్వహించి పెద్దఎత్తున ప్రయివేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయన్నారు. 2021లో కేంద్ర ప్రభుత్వం మోడల్ కెరీర్ సెంటర్‌ను మంజూరు చేసిందన్నారు. ప్రతీ మోడల్ కెరీర్ సెంటర్‌కు ఒక యంగ్ ప్రొఫెషనల్‌ను డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ వారు నియమించారన్నారు. 2023 జనవరి నుండి మోడల్ కెరీర్ సెంటర్ ద్వారా యంగ్ ప్రొఫెషనల్ నిరుద్యోగ యువతకు అన్ని రకాలుగా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో ఒక కొత్త హాల్‌ను అన్ని సౌకర్యాలతో నిర్మించారన్నారు. జాబ్‌మేళాల నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలు, వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు.

లేఅవుట్ల నిబంధనలపై అవగాహన తప్పనిసరి

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

గ్రామాల్లో కొత్తగా లేఅవుట్ల ఏర్పాటులో తీసుకోవాల్సిన నిబంధనలపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని స్టేట్ ఇనిస్ట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ జిఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ జె.మురళీ అన్నారు. లే అవుట్ల ఏర్పాటు, పరిపాలనకు సంబంధించి ఆరు అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో మురళీ పాల్గొన్నారు. గురువారం స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ద్వారా ఈనెల 19వ తేదీ నుంచి 24 వరకూ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రేడ్-1 నుండి గ్రేడ్-5 వరకూ గల పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించుచున్న ఆరు రోజుల రిఫ్రెషర్, స్వమిత్వ శిక్షణ (బ్యాచ్-4) ఇచ్చారు. ఈ సందర్భంగా జె.మురళీ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త లేఅవుట్లకు సంబంధించి నిబంధనల అమలుపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తలేఅవుట్ ఏర్పాటు, పరిపాలనా విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధిహామీ పనులు, వైఎస్‌ఆర్.జగనన్న శాశ్వతభూ హక్కు, క్షేత్రస్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన ఉద్యోగుల విధినిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ముఖ్యకార్యనిర్వహణాధికారి, ప్రిన్సిపల్, డిపిఆర్‌సి కెవిఎస్‌ఆర్.రవికుమార్, ఎపిఎస్ఐఆర్ డిపిఆర్ జాయింట్ డైరెక్టర్ వై.దోసిరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్, జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్‌విశ్వనాధ్, హార్ట్ ఫుల్‌నెస్ శిక్షకులు అప్పారావు పాల్గొన్నారు.



మృతిచెందిన శిశువుతో ఆందోళన చేస్తున్న బంధువులు

ఏరియా ఆసుపత్రిలో శిశువు మృతి

బంధువులు ఆందోళన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన మగ శిశువు మృతిచెందడంతో బంధువులు ఆందోళన చేపట్టారు. గురువారం పురిటి నొప్పులతో ఆసుపత్రికి వస్తే ఆపరేషన్ చేసి మృతిచెందిన శిశువును అప్పగించారని బాధితులు వాపోతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన సజ్జ మురళీకృష్ణ కుమార్తె హేమలతకు రాజమండ్రికి చెందిన ఉల్లి వీరబాబుకు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. గతంలో ఒక బిడ్డ డెలివరీకి ఆపరేషన్ చేశారు. రెండో బిడ్డ పురిటి కోసం హేమలతను జంగారెడ్డిగూడెం తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఈనెల 16వ తేదీన హేమలతను ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో ఇంజక్షన్ ఇచ్చి ఆదివారం ఇంటికి పంపారని బంధువులు తెలిపారు. మళ్లీ గురువారం హేమలతకు నొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకువచ్చామన్నారు. ఆపరేషన్ చేసి బిడ్డను అందిస్తారని ఆశతో ఎదురుచూస్తున్న తమకు మృతిచెందిన శిశువును చేతుల్లో పెట్టారని కన్నీరు పెట్టుకున్నారు. కనీసం కడుపులో బిడ్డ పరిస్థితి విషమంగా ఉందని ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదని బంధువులు ఆరోపిస్తున్నారు. ఓ దశలో ఆసుపత్రి ముఖద్వారం వద్ద బైఠాయించి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు.

ఈ సంఘటనపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీకమల వివరణ ఇచ్చారు. గర్భిణీ హేమలతను 16వ తేదీ ఆసుపత్రికి తీసుకు వచ్చారని, దీంతో పరీక్షించి, నెలలు పూర్తిగా నిండకపోవడంతో మందులిచ్చి ఇంటికి పంపామన్నారు. మళ్లీ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నొప్పులతో బాధపడుతున్న హేమలతను ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. గతంలో ఆపరేషన్ జరిగి ఉన్న హేమలత నొప్పులతో బాధపడటం చూసి వెంటనే ఆపరేషన్‌కు సిద్ధం చేశామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తల్లి ప్రాణానికి హాని కలగకుండా జాగ్రత్త తీసుకున్నామన్నారు. ఆపరేషన్ చేసే సమయానికి కడుపులో మగ బిడ్డ మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆస్పత్రికి తీసుకురాకముందే బిడ్డ మృతిచెంది ఉంటుందని తెలిపారు. అందువల్ల తీవ్ర నొప్పులతో బాధపడుతున్న హేమలత ప్రాణానికి హాని కలగకుండా వెంటనే చికిత్స చేశామని తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఎక్కడా లేదని వివరించారు. అనంతరం కొద్దిసేపటికి బాధితులు ఆందోళన విరమించారు.

అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ

ఘనంగా 161వ జయంతి

ప్రజాశక్తి - భీమడోలు

వాడుక భాష వ్యాప్తికి, సమాజ సంస్కరణలకు రచనలు చేసిన అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వెంకట అప్పారావు ధన్యజీవి అని అన్నేవారి గూడెం ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎస్‌.కె.మస్తాన్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులు గురజాడ వెంకట అప్పారావు 161వ జయంతిని కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గురజాడ అప్పారావు రచనలో ఒకటైన కన్యాశుల్కం నాటకం సమాజ సంస్కరణలకు బీజం పోసిన విధానాన్ని వివరించారు. ఇదేవిధంగా 'దేశమును ప్రేమించుమన్న గీతం' అప్పటి ప్రజలకు కలిగించిన దేశభక్తి గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు గురజాడ రచనలు, బోధనలపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, రాగయుక్తంగా పద్యాల ఆలాపన, ఇతర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఎం.విజయ కుమారి, సిహెచ్ రమాజ్యోతి, ఎం.దుర్గ ప్రసాదిని, పి.ఎం.శారవాణి, కెటిఎస్ రవికుమార్ పాల్గొన్నారు.



అన్నేవారి గూడెం పాఠశాలలో గురజాడ జయంతిని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చింతలపూడి: గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరని చింతలపూడి విశ్రాంతి లెక్చరర్ మల్లెల జయరాజు తెలిపారు. పట్టణంలో గురజాడ అప్పారావు జయంతి స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డిగ్రీ కాలేజ్ విశ్రాంతి లెక్చరర్ మల్లెల జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్రపటానికి శంకుజిష్ణు పూలమాల వేశారు. అనంతరం సాహితీ వేత్త ఎస్.అశోక్ మాట్లాడుతూ గురజాడ అడుగు జాడే భారతీయుల అడుగుజాడ అని కొనియాడారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ ఆనాడు గురుజాడ చెప్పింది నేటికీ భారతదేశంలో కనపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేపల్లి అప్పారావు, కె.అనురాధ, ఆర్‌వియస్.నారాయణ, కె.వాసు పాల్గొన్నారు.

నేడు సాల్మన్‌రాజు సంస్మరణ సభ



ప్రజాశక్తి - భీమడోలు

కార్మిక నేత, సిఐటియు మండల కార్యదర్శి కామ్రేడ్ వై.సాల్మన్ రాజు సంస్మరణ సభను ఈనెల 22వ తేదీన భీమడోలులో నిర్వహించనున్నట్లు సిఐటియు మండల అధ్యక్షురాలు జి.స్వర్ణకుమారి తెలిపారు. ఈనెల 15వ తేదీన అనారోగ్య కారణాలతో సాల్మన్‌రాజు భీమడోలులో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన సంస్మరణ సభను 22వ తేదీన అర్జావారిగూడెంలోని సామాజిక కేంద్ర భవనంలో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, బి.సోమయ్య పాల్గొంటారని తెలిపారు.



వినతిని సమర్పిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ, శ్రీనివాసరావు

వేతన బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఎంప్లాయిస్‌కి జులై, ఆగస్ట్ నెల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాద్ రెడ్డిని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, పార్ట్ టైం ఇన్స్‌పెక్టర్ రాష్ట్ర అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు అమరావతిలో కలిసి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా జీతాలు లేక సమగ్ర శిక్ష ఎంప్లాయిస్ ఇబ్బందిలు పడుతున్నారని మంత్రికి వివరించారన్నారు. స్పందించిన మంత్రి జీతాలు ఇచ్చేందుకు బడ్జెట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ

జగనన్న భూహక్కు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రగఢపల్లి, వింజరం గ్రామ సచివాలయం పరిధిలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం కింద ప్రజలకు జగనన్న భూహక్కు పత్రాలను జిల్లా ఎంపీపీ సంఘాల అధ్యక్షులు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, ఎంపిటిసి కుంజం చిట్టెమ్మ, సర్పంచి కోక్కెర వెంకటలక్ష్మి, ప్రగఢపల్లి విఆర్ఒ, వింజరం విఆర్ఒ పాల్గొన్నారు.

ఎన్నికల బూత్ మార్చాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

ఎన్నికల బూత్‌ను ప్రాథమిక పాఠశాలలో కాకుండా ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలని చిన్నంపేట గ్రామస్తులు గురువారం తహశీల్దార్‌కు వినతిని సమర్పించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనరల్, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిసారి ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రాథమిక పాఠశాలలో ఓటింగ్ వేయటానికి వెళ్లిన ఓటర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని స్థానిక చిన్నంపేట గ్రామస్తులు కొమ్ము సుజాన రావు, కొమ్ము ఆనందం తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావుకు వినతిని సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని చిన్నంపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్నారని, ఆ పాఠశాలలో ఓటర్లు నిలబడటానికి స్థలము లేకపోవటం, ఒకే పాఠశాలలో నిర్వహించడం వలన ఓటర్లు తమ ఎన్నికల బూత్ నెంబరు తెలియక గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ఈసారి ఎన్నికల బూత్ ప్రాథమిక పాఠశాలలో కాకుండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలని, ఆ పాఠశాలలో విశాలమైన స్థలము ఉండటం వలన ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని కోరారు.



పాదయాత్రలో టిడిపి, జనసేన నేతలు

అధ్వానంగా రోడ్లు

టిడిపి, జనసేన ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోటలో రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉండి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, రోడ్డు వేయాలని జనసేన, టిడిపి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో జనసేన ఇన్‌ఛార్జి మేక ఈశ్వరయ్య మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనలో రోడ్లులు కూడా వేయలేదన్నారు. ఎంపి ఉండి కూడా కనీసం సొంత ఊరికి రోడ్డు వేయించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. ఎంఎల్ఎ ఎలిజ అసలు నియోజకవర్గం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎడవల్లి నుంచి కామవరపుకోట వరకు రోడ్లు అద్వానంగా ఉండి, వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు షేక్ వలి, వీరబాబు, తోటకూర మాణిక్యాలరావు, కోట భాస్కర్, కౌశిక్, లక్ష్మణరావు, శివ, మెరువ శివాజీ, వీరిశెట్టి గూడెం జనసేన మణి, లింగేశ్వర రావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల రాణి చిన్నమ్మరావు పేట(చెరువు వీధిలో) శ్రీగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ 39వ వార్షికోత్సవం, వినాయక చవితి సందర్భంగా గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని వైసిపి నాయకులు బొండాడ వెంకన్న బాబు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. సుమారు 2 వేల మంది వరకూ అన్నదానంలో పాల్గొన్నారు. 39 సంవత్సరాలుగా చెరువు వీధిలో శ్రీగణేష్ ఉత్సవ కమిటీ వినాయక చవితి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో వైసిపి యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, ఉక్కుర్తి వెంకట్రావు, కొలిసుబ్బారావు, అన్సారీ బాషా, గుర్రాల లక్ష్మణ్, అచ్యుత ఏసుబాబు, నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పరిస్థితి విషమించి క్షతగాత్రుడు మృతి

ప్రజాశక్తి - భీమడోలు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భీమడోలు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సూరిశెట్టి శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు దెందులూరు మండలం కొమిరేపల్లి గ్రామానికి చెందిన కొండ బత్తుల రమేష్(24) ఈనెల 17వ తేదీన నల్లజర్లలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. అక్కడ నుంచి స్వగ్రామానికి స్కూటీ మోటర్ వాహనంపై బయలుదేరిన రమేష్ మార్గమధ్యంలో అంబరుపేట శివారులోని వేబ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు భాస్కరరావు పేట విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడా జట్టుకు భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంఎ కైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.పాండురంగారావు తెలిపారు. మండలంలోని భాస్కరరావు పేట జెడ్‌పిహెచ్ విద్యార్థులు ఈనెల 20వ తేదీన గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించిన అండర్ -14లో సిహెచ్ సుధా ధనలక్ష్మి, అండర్-17లో జె.ప్రసన్న రాణి, పి.మౌనిక, ఎస్.చరిష్మ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన పిడిజి రవిని హెచ్‌ఎం కె.పాండురంగారావు, ఉపాధ్యాయులు అభినందించారు. గ్రామీణ స్థాయి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటిబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్, పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల, డ్రైవర్ల, క్లాప్ డ్రైవర్ల, ఆఫీస్ సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేసే ఊసే లేదన్నారు. పర్మినెంట్ కార్మికుల జిపిఎఫ్ ఖాతాల తెరవింపుపై, సరెండర్ లీవుల ఎన్‌కేష్మెంట్ రెండేండ్లు దాటినా విడుదలవకపోవడంపై ప్రభుత్వంలో చలనమే లేదని విమర్శించారు. ఒకవైపు పెండింగ్ సమస్యలు పెరుగుతున్నా, ఉద్యోగ, కార్మికుల సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అనే విషయం ఈ వైసిపి సర్కార్ విస్మరిస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనలు నిర్వహించాలని భావించి, సెప్టెంబర్ 21 నుంచి 27 వరకు కార్మికులు నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని కోరారు. సెప్టెంబర్ 22న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా, 24న మున్సిపాలిటీల వద్ద మానవహారాలు, 25న జిల్లా కలెక్టర్లకు వినతులు సమర్పించాలని తెలిపారు. సెప్టెంబర్ 26న రీజనల్ డైరెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చింతలపూడి స్థానిక సమస్య 19 మంది మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చడం కోసం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెలగాడ అనురాధ శ్రీరామ్, పార్వతి శ్రీరామ్, కోటయ్య పొదిలి, చిన్నయ్య పొదిలి, మార్తమ్మ శ్రీరామ్ పాల్గొన్నారు.

'24 గంటలూ అందుబాటులో ఉండాలి'

జీలుగుమిల్లి: వైద్య సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని డిఎమ్‌అండ్‌హెచ్‌ఒ డా.ఎస్.శర్మిష్ట తెలిపారు. గురువారం కుక్కునూరు పర్యటన అనంతరం సాయంత్రం జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. అదే విధంగా ఆసుపత్రిలో డెలివరీ రిపోర్ట్‌లో డెలివరీ కేసులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి - చింతలపూడి

సామాన్య ప్రజల నుంచి టిడిపికి మద్దతు పెరుగుతుండడంతో చూసి ఓర్వలేని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారని టిడిపి నాయకులు తెలిపారు. పోస్ట్ కార్డులు రాసి మా మద్దతు బాబుకి తెలియజేస్తున్నామని నగర పంచాయతీ టిడిపి అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం అన్నారు. నగర పంచాయతీలోని పాత చింతలపూడి గ్రామంలో నారా చంద్రబాబునాయుడుకి మద్దతుగా మేము సైతం బాబు కోసం అంటూ పోస్ట్ కార్డులు రాజమహేంద్రవరం సెంట్రల్ కారాగారానికి రాసి పోస్ట్ చేశారు. అనంతరం టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయ్ కుమార్ మాట్లాడుతూ నారా చంద్రబాబు అరెస్టైన దగ్గర నుంచి ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లమీదకి వచ్చి మద్దతు తెలిపుతున్నారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపిల ఐక్యతతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, టౌన్ టిడిపి ఉపాధ్యక్షులు మన్యం సత్తిబాబు, రాయప్ప, జనసేన మండల ప్రధాన కార్యదర్శి వీర మహిళ భారతి, ముళ్ళగిరి సుందరమ్మ, మద్రిపూడి నాగేశ్వరమ్మ, నలమాటి శ్రీను, రామకృష్ణ, నందిపాము నాగేశ్వరరావు, గంటా నాగభూషణం, నత్త రవి, ఏబు, వాసు పాల్గొన్నారు.



చింతలపూడిలో పోస్టుకార్డుల ద్వారా మద్దతు తెలుపుతున్న నేతలు

చాట్రాయి: మండలంలోని మంకొల్లులో తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా గురువారం నీటిలో నుంచుని టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు నిరసన దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు(చిట్టిబాబు), జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండలపు జగదీష్ పాల్గొన్నారు.

పోలవరం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా కొయ్యలగూడెం మండల కేంద్రంలో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులుతో కలిసి, పార్టీ అనుబంధ విభాగమైన బిసి సెల్ అధ్యక్షులు డోకల నాగేశ్వరరావు, కార్యకర్తలతో కలిసి దీక్ష చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చి సంఘీభావం తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ముసునూరు: చంద్రబాబునాయుడు అరెస్టునకు నిరసనగా తొమ్మిదో రోజు గురువారం మండలకేంద్రమైన మండపం సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్షలో గద్దే రఘుబాబు, కొల్లి గంగారామ్, మండవ బుజ్జియ్య, గారపాటి నరిసింహారావు, లక్కపాము కాంతారావు, కాటేపల్లి సత్యనారాయణ, దేవినేని శ్రీధర్, కందుల పిచ్చియ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలో దోమల నివారణ, పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీపీ కొదమ జ్యోతి అధికారులకు సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొదమ జ్యోతి మాట్లాడుతూ ఇటీవల నెలకొన్న వాతావరణ మార్పులతో జ్వరాలు పెరుగుతున్నాయన్నారు. తంగేడు గ్రామ సర్పంచి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.విజయ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ రమేష్త, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే

భీమడోలు: మండలంలోని పొలసానిపల్లిలో డెంగ్యూ కేసు నమోదవ్వడంతో గుండుగొలను పిహెచ్‌సి సిబ్బంది గురువారం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు పొలసానిపల్లి గ్రామానికి చెందిన యువకుడికి డెంగ్యూ నిర్ధారణైంది. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పిహెచ్‌సి వైద్యులు తెలిపారు. దీంతో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన ఆదేశాల మేరకు గ్రామ వ్యాప్తంగా పారిశుధ్య పరిరక్షణ పనులు చేపట్టారు.

'పొదుపుపై అవగాహన ఉండాలి'

జంగారెడ్డిగూడెం: విద్యార్థి దశ నుంచే పొదుపుపై అవగాహన పొందాలని సిఎస్‌టిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.ప్రసాద్ బాబు తెలిపారు. గురువారం స్థానిక చత్రపతి శివాజీ శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా.ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారిచే పొదుపుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇంఛార్జి డా.కె.ఉత్తమ్ సాగర్ మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పొదుపు మాత్రమే కాకుండా ఇన్సూరెన్స్‌కి చాలా ప్రాముఖ్యత ఉన్నదన్నారు. విద్యార్థుల స్థాయి నుంచే పొదుపులను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో ఆ మొత్తం మనకి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ పోస్ట్‌మెన్ కె.వెంకటేశ్వరరావు, ఆధార్ ఆపరేటర్ డి.కాంతారావు, బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్ది ఆలయ ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ విడుదల

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. మద్ది ఆలయ ధర్మకర్తల నియామకం నోటిఫికేషన్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కాకినాడ వారు విడుదల చేశారన్నారు. ఆసక్తి కలిగిన వారు 20 రోజుల్లోపు దరఖాస్తులను దేవాదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

వేణుగోపాల స్వామి ఆలయానికి నోటిఫికేషన్ జారీ

వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఏలూరు వారు నోటిఫికేషన్ విడుదల చేశారని ఎ.కొండలరావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఫీవర్ సర్వే పరిశీలన

నూజివీడు రూరల్: మండలంలోని ముక్కొల్లుపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలను గురువారం డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఆశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.